క్లుప్తంగా

నేడు రథోత్సవం

కలికిరి(వాల్మీకిపురం): శ్రీ పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రథోత్సవానికి టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు, ట్రాన్స్ అధికారులు, అగ్నిమాపకశాఖ అధికారులు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని రథోత్సవానికి ఏర్పాట్లను పూర్తి చేశారు. శ్రీరాముడి బ్రహ్మరథానికి కొత్త రథచక్రాలను సిద్ధం చేస్తున్నారు. రథోత్సవం సందర్భంగా రథానికి కొత్తకొత్త రంగులను అద్దారు.

ఘనంగా నకారా జయంతి



నకారా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ: స్థానిక ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ పితామహుడు నకారా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెన్షనర్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లకు చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ పెన్షనర్లు ఈ రోజు పెన్షన్ తీసుకుంటున్నామంటే నకారా కోర్టులో సాధించిన విజయమన్నారు. త్వరలో ఆంధ్ర పెన్షనర్స్ పార్టీకి ఎన్నికలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో అసోసియేటివ్ అధ్యక్షులు శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ జగన్‌మోహన్, కోశాధికారి తిమ్మయ్య,ఈసీ సభ్యులు శివకుమార్,మగ్బూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ములకలచెరువు: మండలంలోని వేపూరికోట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉమాశంకర్‌రెడ్డిని ఎస్టీయూ నాయకులు మంగళవారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు నవోద పాఠశాలకు ఎంపికకావడంతో సన్మానించారు. నవోద పరీక్షలో విజయం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మునీంద్రనాయక్, కృష్ణారెడ్డి, రామకృష్ణ, రమణా తదితరులు ఉన్నారు.

గోపుర కలశాలు వితరణ



గోపురకలశాలను వితరణగా ఇస్తున్న దాతలు

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన గోపురానికి కలశాలు వితరణగా ఇచ్చారు. పెద్దమండ్యంకు చెందిన నారరామచంద్రయ్య, రామక్రిష్ణ, శ్రీనివాసులు కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విలువ చేసే కలశాలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఇటీవల ఆలయం ముఖద్వారం వద్ద గోపుర నిర్మాణాన్ని చేపట్టారు. గోపుర కలశాలను తనతల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయం వద్ద మంగళవారం రాత్రి అర్చకులకు అందజేశారు. కలశాలు వితరణగా ఇచ్చిన కుటుంబ సభ్యులను పాపేపల్లె గ్రామ ప్రజలు, భక్తులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పీలేరు : పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ రాజమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీలేరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులను నమోదు చేయాలని, పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలు ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సరైన పోషణ లేకపోతే కలిగే అనర్థాల గురించి వివరించారు. అంటువ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. పోషకాహార మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి పాటుపడదాం



కందుకూరులో వైద్య సిబ్బంది ర్యాలీ

పెద్దతిప్పసముద్రం: ఆరోగ్యకరమైన సమాజం కోసం అందరం పాటుపడదామని పీహెచ్‌సీ డాక్టర్ శంకర్, బి.కొత్తకోట సీహెచ్‌సీ దంత వైద్య నిపుణులు దుర్గాదేవి ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని కందుకూరు పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా నోటి, గొంతు కేన్సర్ ఎలా ప్రబలుతుందనే అంశంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

- జీఓ 30 కింద 150 గజాల వరకు ఉచితంగా ర్యెగులరైజ్
- క్రమబద్ధీకరణ పట్టాలు మహిళల పేర్లపై జారీ
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ.సిసోడియా, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం–2025 పేరుతో జీఓ 30 పేరుతో మార్గదర్శకాలు జారీచేశారని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... జీఓ 30 ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి, పట్టాలను మహిళల పేరుపై జారీ చేస్తామన్నారు. 2019 అక్టోబర్ 15వ తేదీ కంటే ముందు ప్రభుత్వ స్థలాల్లో నివసించేందుకు అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారందరూ దీనికి అర్హులన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు అనుసరించి దరఖాస్తు చేసుకుంటే అర్హతలను పరిశీలించి హక్కులు కల్పిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్, జోనల్‌ప్లాన్‌లోని నిర్దేశిత స్థలాలు, లే అవుట్లు, కాలువలు, నదీప్రవాహ గట్లు, వాగులు, వంకలు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని పేర్కొన్నారు. 150 గజాల వరకు ఉచితంగానే క్రమబద్ధీకరణ చేస్తామని, 301 గజాల కంటే ఎక్కువ భూమి ఆక్రమణలో ఉంటే... సాధారణ రిజిస్ట్రేషన్ విలువతో క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. జీఓ 30 కింద ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అర్హులు గ్రామ, వార్డు సచివాలయాల్లో లేదా మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ఫ్యామిలీని యూనిట్ కింద పరిగణిస్తామని, కాకపోతే లబ్ధిదారుల కుటుంబసభ్యులు ఐటీ చెల్లింపుదారై ఉండకూడదని, నాలుగుచక్రాల వాహనం కలిగి ఉండరాదన్నారు. కరెంటు వాడకం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1లక్ష 20వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1లక్ష 44వేల కంటే తక్కువ ఆదాయం కలిగి ఉండాలన్నారు. ఈ పథకం కింద జీవితంలో ఒకసారి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గృహనివేశన స్థలాలు, ఇళ్లను పొందలేరన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలు డిసెంబర్ 31, 2025లోపు జీఓనెం.30 కింద దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. క్రమబద్ధీకరణకు సంబంధించి ..లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు లభిస్తాయన్నారు. మదనపల్లె డివిజన్‌లోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఆయా మండల తహసీల్దార్‌లను సంప్రదించాలన్నారు.

జీఓ 30ని సద్వినియోగం చేసుకోండి

పీలేరు : జీఓ 30ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వివాదాలు లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రస్తుతం జీఓ 30ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ జీవో ప్రకారం 2019 అక్టోబర్ 15 మునుపు నిర్మించుకున్న ఇళ్లకు ఈ జీవో వర్తిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు, పదెకరాల కంటే తక్కువ పొలం, ఆదాయ పన్ను చెల్లించనివారు మాత్రమే అర్హులని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రూ. 12 వేల ఆదాయం ఉన్నవారు, 150 గజాల కంటే తక్కువ స్థలం ఉన్నవారికి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుందని తెలిపారు. 150 గజాల కంటే ఎక్కువ ఉన్నవారికి ప్రభుత్వం నిర్ణేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.

బంగారు నామాల వితరణ



కుటుంబంతో కలిసి నామాలను బహూకరిస్తున్న సాంబశివ

బి.కొత్తకోట: మండలంలోని బండారువారిపల్లె సర్పంచు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని సాంబశివ మంగళవారం గ్రామంలో వెలసిన రామాలయానికి రూ.2.50 లక్షల విలువైన నాలుగు బంగారు నామాలను ఆలయానికి అందజేశారు. ఆలయంలోని సీతా, రామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలకు బంగారు నామాలను తన సొంత సొమ్ముతో తయారు చేయించారు. వీటిని శాస్త్రోక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా నామాలను ఆలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ సతీష్‌కుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో ఉన్న మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో మండలాభివృద్ధికి సహకరించాలన్నారు. ఏపీవో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పశువుల దాహార్తి తీర్చడానికి ఉపాధి హామీలో 29 నీటి తొట్టెలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే పది రకాల పండ్ల తోటల పెంకానికి మండలంలో 150 ఎకరాలకు మంజూరైనట్లు చెప్పారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా పనులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈఓ రమాదేవి మాట్లాడుతూ రైతులకు 75 శాతం రాయితీతో 1600 బస్తాల జిప్సం అందుబాటులో ఉందన్నారు. 50 శాతం రాయితీలో 150 లీటర్ల వేపనూనె అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిత, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, మండల కోఆప్టెడ్ సభ్యుడు ఎస్. సయ్యద్‌బాషా, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, ఎంపీడీవో శివశంకర్, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళ రెషిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్యాడ్ బ్యాంక్

కలికిరి: హెల్పింగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ మహిళ రెషిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఆ సంస్థ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు అనువుగా ప్యాడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి మాట్లాడుతూ విద్యార్థినుల సౌకర్యం కోసం స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి కళాశాల ఆవరణలో ప్యాడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక దంపతులు అబూబకర్, ఆర్షియాను దుశ్శాలువాతో సన్మానించారు. అధ్యాపకులు కె.మాధవి, స్వర్ణలత, రామక్రిష్ణ, ఉదయ, లిఖిత, జి.మాధవి, హాజీరా, శైలజ, కీర్త పీ.ఒ. ఎస్.గులాబ్ జాన్, హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

– ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1వ తేదీని విజయవంతం చేద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై ఉద్యమిద్దామన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను నేడు కార్మిక ఓట్లతో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక శ్రమను దోచుకోవడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తోందన్నారు. మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా ఎండకడతామని తెలిపారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ వ్యవసాయ, సహకార రంగాలను కూడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి పెద్ద కుట్రలు చేస్తుందని విమర్శించారు. కేంద్ర రంగాలైన రైల్వే, రక్షణ, విద్యుత్తు, పబ్లిక్ సర్వీస్ లను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనలను రోజురోజుకు తీవ్రతరం చేస్తుందన్నారు .వాటిలో అధిక పెట్టుబడులను ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు ఇస్తుందని దీనికి వ్యతిరేకంగా, కార్మికులు,ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజక వర్గ కార్యదర్శి ముబారక్, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల,సాబ్ జాన్ పాల్గొన్నారు.

వారంలో అందుబాటులోకి అతిథి గృహాలు

–టూరిజం డీవీఎం శ్రీనివాసరావు



ఆధునీకీకరణ పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, అధికారులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై చేపట్టిన అతిథి గృహాల పనులు పూర్తయ్యాయని, వీటిని వారంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని పర్యాటకశాఖ తిరుపతి డీవీఎం సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కొండపై మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాస్‌తో కలిసి పూర్తయిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. రూ.10 కోట్లతో చేపట్టిన అతిథి గృహాల ఆధునికీకరణ పనుల్లో ప్రస్తుతానికి 12 అతిథి గృహాల పనులు పూర్తి చేయించామని చెప్పారు. వీటిని పరిశీలించిన ఆయన ఇంకా మిగిలిన పనులను గుర్తించి వాటిని ఒకట్రెండురోజుల్లో పూర్తి చేసి తక్షణమే పర్యాటకశాఖకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తర్వాత కాన్ఫరెన్స్‌హాలును పరిశీలించారు. పాతికేళ్ల క్రితం నిర్మించిన దీన్ని ఆధునీకరించడం, మరిన్ని వసతులతో అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇప్పటికే మంజూరైన నిధుల్లో కాంట్రాక్టర్ చేపట్టాల్సిన మిగిలిన పనులను సమీక్షించారు. కొత్త రెస్టారెంట్, మిగిలిన గదుల ఆధునీకరణ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై మేనేజర్ సాల్విన్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల తర్వాత 12 అతిథిగృహాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. విండ్‌ఫాల్, యాత్రి నివాస్ అతిథి గృహాలను స్టార్ హోటల్ తరహాలో అన్ని సౌకర్యాలతో ఆధునీకరించడం జరిగిందన్నారు. పర్యాటకులు టూరిజం సేవలు పొందాలని కోరారు.

అభిమాన నేతకు సన్మానం

తంబళ్లపల్లె: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి మంగళవారం ఆయన స్వగృహంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు ఎంపిటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ, భర్త ఉత్తన్నలు షిర్డి సాయిబాబా ఆలయం నుంచి కిరీటం, శాలువలు తీసుకువచ్చారు. ఎమ్మెల్యేకు సన్మానం చేసి జ్ఞాపికను అందజేసి తమ అభిమానం చాటుకున్నారు.

ఘనంగా వసంతోత్సవాలు

రామసముద్రం: మండలంలోని ఎర్రబోయినిపల్లి, వై.కురప్పల్లె, జంగాలపల్లి గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఘనంగా వసంతోత్సవం నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో బ్యాండు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మల్లయ్యకొండపై ప్రత్యేక పూజలు



రమణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అలంకరణలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కొండపై చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నాయకులతో చర్చించారు. అనంతరం గోపిదిన్నె పంచాయతీ బోరెడ్డివారికోట వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి తల్లి చిన్నకమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందింది. వారి స్వగృహానికి వెళ్లి రమణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైఎస్ఎంపీపీ కరీమ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, రామమూర్తి, జయనారాయణరెడ్డి, కె.ఆర్.మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన రామనామ స్మరణ



తేరును లాగుతున్న భక్తులు

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీ శ్రీరామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని (తేరు) ఘనంగా నిర్వహించారు. రథం ముందు పూజా కార్యక్రమాలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను తేరుపై ఉంచి ఆలయం నుంచి సొసైటీకాలనీలోని వీధుల్లో ఊరేగించారు. రామనామస్మరణలతో రథాన్ని భక్తులు లాగారు. శ్రీరామ స్మరణతో మార్మోగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. తేరుపై మిరియాలు, పూలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా రామయ్య పట్టాభిషేకం:

సొసైటీకాలనీలోని రామాలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా ఉదయం రాములోరి పట్టాభిషేకం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రామయ్యకు కిరీటాన్ని ధరించారు. తీర్థాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

తంబళ్లపల్లె: రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీ లత మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో బాలుర విభాగంలో అజార్‌మహమ్మద్, గౌసమహ్మద్, స్టాండ్‌బైగా హర్షవర్ధన్, బాలికల విభాగంలో కరీమున్నా జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. వీరు ఈనెల 26, 27 తేదీల్లో మదనపల్లె వశిష్ట స్కూల్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ వాణిశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థిమిత్ర సామగ్రి అందరికీ అందాలి



స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పెంచలయ్య

పీలేరు : సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర సామగ్రి విద్యార్థులందరికీ అందాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ పెంచలయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టాకు పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గాను విద్యార్థులందరికీ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యా సామగ్రి తగు ఏర్పాట్లతో భద్ర పరచుకోవాలని సూచించారు. విద్యా సామగ్రిని పాఠశాలల వారీగా విభజించుకుని, పాఠశాలలు పున:ప్రారంభమయ్యే లోపు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు వెంకటరామయ్య, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, కమిటీ మెంబర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కలకడ : ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లు అందించడమే లక్ష్యంగా మండల విద్యాశాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం కలకడ ఆదర్శపాఠశాలలోని భద్రతా గదులను పరిశీలించారు. స్థానిక ఆదర్శపాఠశాలలో నాలుగు గదులను ఎంపిక చేసి భద్రపచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంఈఓ మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డికు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటరామయ్య, ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి, డీవైఈఓ మల్లికార్జున, సిఆర్పీ శ్రీకాంత్, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : ప్రతి విద్యార్థికి సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందించాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ కె. పెంచలయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాకు పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కిట్ అందించేందుకు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు వెంకటరామయ్య, ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మాజీ సైనిక కుటుంబానికి అండగా నిలిస్తే కేసులా?

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన మాజీ సైనికుల సంఘం నాయకులు



సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ సైనిక సంఘం నాయకులు

మదనపల్లె : వాల్మీకిపురం మండల తహసీల్దార్ పామిలేటి, రెవెన్యూ అధికారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న మాజీ సైనికుడు కుమారుడు వెంకటాద్రి కుటుంబానికి అండగా నిలిస్తే...మాజీ సైనికులమైన తమపై పోలీసు కేసులు పెడతారా..? మాజీ సైనిక కుటుంబానికి అన్యాయం జరిగిందని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడం తప్పా... అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్‌ను కలిసి, తప్పుడు కేసులు పెట్టిన వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌ల వ్యవహారశైలిపై వివరిస్తూ వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తహసీల్దార్ పామిలేటిపై జ్యుడీషియల్ విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం నాయకులు కంచర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ...వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లె పెద్దవంకపల్లెకు చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుమారుడు వెంకటాద్రి, ఏప్రిల్ 3న తహసీల్దార్ పామిలేటి, మరికొందరి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. దీనిపై అధికార యంత్రాంగం సరైన చర్యలు చేపట్టనందున, బాధిత కుటుంబం మదనపల్లె డివిజన్, వాల్మీకిపురం మాజీ సైనికుల సంక్షేమ సంఘం సహాయాన్ని కోరారన్నారు. దీంతో బాధిత కుటుంబానికి అండగా ఈనెల 5న వాల్మీకిపురంలో ధర్నా చేసి నిరసన తెలిపామన్నారు. దీనిపై వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్ మాజీ సైనికులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి దుర్భాషలాడి, దురుసుగా ప్రవర్తించారన్నారు. రైతు ఆత్మహత్య వెనుక పెద్దవారు ఉన్నారని, ధర్నా ఎలా చేస్తారని బెదిరించారన్నారు. 7వ తేదీన పోలీసులు స్టేషన్‌కు రావాల్సిందిగా కోరి, కేసులు పెడుతున్నట్లు చెప్పి ఖాళీ నోటీసులపై సంతకాలు చేయించుకున్నారన్నారు. బైండోవర్ కేసులు పెడుతున్నట్లు చెప్పారన్నారు. అదేరోజు ఎస్ఐ చంద్రశేఖర్ పెద్దవంకపల్లెకు వెళ్లి కేసు వెనక్కు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని బెదిరించారని బాధితులు తమకు చెప్పారన్నారు. ఇవన్నీ చూస్తుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడం తప్పేలా అవుతుందన్నారు. రైతు ఆత్మహత్య కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, కేసు దర్యాప్తును సీబీసీఐడీకి అప్పగించాలన్నారు. తహసీల్దార్ పామిలేటిని తక్షణమే సస్పెండ్ చేసి జ్యుడీషియల్ విచారణ జరపాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, 5 ఎకరాల ప్రభుత్వ భూమి ,కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ సైనికులతో అమర్యాదగా ప్రవర్తించడమే కాకుండా తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు గురిచేసిన సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు సీఎల్.నారాయణ, టి.ప్రతాప్‌రెడ్డి, ఎస్.నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో బుధవారం నుంచి శ్రీ పట్టాభిరాముల వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచకం, హనుమంత వాహనం, శేష వాహనం, గురువారం ధ్వజారోహణం, మోహినీ ఉత్సవం, సూర్యప్రభ వాహనం, శుక్రవారం కళ్యాణోత్సవం, సింహ వాహనం, శనివారం బ్రహ్మ రథోత్సవం, ఆదివారం వసంతోత్సవం, పార్వేటోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

కేవీపల్లె : ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వడదెబ్బ పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. ఎండల నేపథ్యంలో ప్రజలు తెల్లని, లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పాలఏకరి కులాల జనాభా ప్రకటించాలి

మదనపల్లె సిటీ: ప్రభుత్వం కులాల సమగ్ర సర్వే 2024లో కులాల సర్వే చేశారని, అందులో పాల ఏకరి కులాల సంఖ్యను ప్రకటించాలని రాష్ట్ర పాల ఏకరి సేవా సమితి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జన్నే రాజేంద్రనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంఘం నాయకులు ప్ల కార్డులు ప్రదర్శించారు. కులాల సమగ్ర సర్వేలో పాల ఏకరి, ఏకిల, ఏకరి, నాయునివారు, పాలేగారు, తొలగరి, కావలి ఉప కులాను జనాభా లెక్కలో చూపలేదన్నారు. అసలు కుల జనాభా లెక్కలో పాలఏకరిలు ఉన్నారా లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాల ఏకరి కులం ఎక్కువగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పదించి పాల ఏకరి కుల గణన చేయాలని కోరారు. సమావేశంలో పాల ఏకరి సంఘ నాయకులు చలపతి, కదిరిపతి, లక్ష్మి నారాయణ, విశ్వనాథ; శ్రీనివాసులు రాజానాయుడు, వేణు, రామాంజులు పాల్గొన్నారు.

నల్లగ్గారి బయ్యారెడ్డి మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

కురబలకోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కనసానివారిపల్లెకు చెందిన నల్లగ్గారి మూలింటి బయ్యారెడ్డి (70) మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. ఇతను గ్రామంలో వైఎస్సార్ సీపీకి గట్టి నాయకుడిగా ఉన్నారు. స్థానికంగా వివిధ సమస్యలను అధికారయంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారు. నల్లగ్గారి బయ్యారెడ్డి ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇతని మరణ వార్తను తెలుసుకున్న ఆయన హుటాహుటిన కనసానివారి పల్లె చేరుకుని బయ్యారెడ్డి మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. సర్పంచులు ఆర్కే కృష్ణారెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ సభ్యులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షురాలు జంగావారిపల్లె అరుణమ్మ, మండలంలో క్రియాశీలక ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, కొండతూర్పు అశోక్ రెడ్డి, మహేష్, ప్రవీణ్ రెడ్డి తదితరులు నివాళి అర్పించారు. బుధవారం ఉదయం బయ్యారెడ్డి మృత దేహానికి కనసానివారి పల్లెలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.